# నిన్ను ప్రేమించలేను

**ఆరోజు శ్రావణ పౌర్ణమి. రాఘవ ఉదయాన్నే లేచి స్నానం వగైరాలు పూర్తి చేసుకుని దేవుడిదగ్గర నేతి దీపాలు వెలిగించి, పాత యజ్ఞోపవీతాన్ని తీసివేసి కొత్తది వేసుకుంటూ గాయత్రీ మంత్రం చదివాడు. భక్తితో కళ్లు మూసుకుని దేవుడిముందు సాష్టాంగపడి లేచాడు. ఈ రోజుల్లో దేవుడు-భక్తి; పూజ-పునస్కారం; పెద్దలంటే భయం-గౌరవం; బంధుప్రీతి, ఉండి హిందూ సంప్రదాయాలకు విలువనిచ్చే రాఘవలాంటి యువకులు చాలా అరుదుగా కనిపిస్తారంటే అతిశయోక్తి కాదు. ప్రతీ నిత్యం నిష్ఠగా దైవపూజ చేసి దేవుడికి పెట్టిన నైవేద్యం స్వీకరిస్తేగాని కాఫీ కూడా తాగడు రాఘవ. శనివారం వస్తే ఉల్లిపాయ తినడు. తాతగారు... (రాఘవాచారి గారు)నమ్మి ఆచరించిన సనాతన హిందూ సంప్రదాయాలను, కలకత్తా మహానగరంలో కూడా పాటిస్తున్నాడు.**

రాఘవ బట్టలు మార్చుకుని ఆఫీసుకి బయలుదేరుతుండగా ఫోన్ మోగింది. అలా రెండు మూడు సార్లు ఫోన్ మోగి ఆగిపోయింది. ఈసారి ఫోన్ మోగగానే మాట్లాడాలని రాఘవ ఫోన్ పక్కనే కూర్చున్నాడు.

ఫోన్ మళ్లీ మోగింది. ఒక్క వుదటున రిసీవర్ని చేతిలోకి తీసుకున్నాడు రాఘవ.

"హలో!..." ఎవరిదో స్త్రీ గొంతు.

"హలో!... నేను రాఘవని. మీరు... ఎవరు... మాట్లాడుతున్నారు?"

"బాబూ! నన్ను పోల్చుకోలేదు కదూ!" అప్యాయమైన ఆ పిలుపు, మెత్తటి ఆ స్వరం వినగానే రాఘవ మనసుకి ఏదో హాయి అనిపించింది.

"సారీ అండి. మీరెవరో నాకు తెలీదు. చెప్పండి మీకేం కావాలో!!"

"నీకు... మీ మేనత్త గుర్తుందా? మీ నాన్నగారి ఆఖరి చెల్లెలు వసుమతి! నేను బాబూ, వసుమతిని!"

రాఘవ నిటారుగా అయ్యాడు.

ఫోన్‌లో మాట్లాడుతున్నది ఎవరో కాదు! స్వయానా తన మేనత్త!

తాతగారు ఉద్యోగరీత్యా తన భార్య, పిల్లలతో కేరళలో వుండేవారు. నాన్నగారు ఆయన పెద్దకొడుకు. వసుమతి ఆ ఇంటి ముద్దుబిడ్డ. అయితే, ఆమె ఎవరో కేరళ క్రిస్టియన్ని ప్రేమించి పెళ్లిచేసుకుందన్న కోపంతో తాతగారు ఆమెను తన ముఖం మరెప్పుడూ ఆయనకి చూపించవద్దని శాసించారు. అత్త ఏడుస్తూ వెళ్లిపోయింది. నాన్నగారికి చెల్లెలంటే ప్రాణం. అందుకే నాన్నగారు చాలా బాధ పడ్డారు. పెద్దవాళ్ల చాదస్తాలకి పిల్లలు మానసికంగా ఎలా బలయిపోతున్నారో తెల్సింది.

ఆ తర్వాత తాతగారు అక్కడ నలుగురిలోనూ ముఖం ఎత్తుకోలేక ఆ ఉద్యోగానికి రిజైన్ చేసేసి ఆంధ్రప్రదేశ్ వచ్చి మరో ఉద్యోగం చూసుకుని సెటిలయిపోయారు. అప్పట్నుంచి వసుమతిని అందరూ మర్చిపోవడానికి ప్రయత్నించారు. రాఘవకి చాలా సంతోషంగా వుంది. ఇన్ని సంవత్సరాల తర్వాత తను మేనత్త గొంతు విన్నందుకు, ఆమెతో మాట్లాడుతున్నందుకు!

"ఏం బాబూ! గుర్తుపట్టావా?"

"ఆఁ, ఆఁ, అత్తా; మీరు ఎక్కడ్నుంచి మాట్లాడుతున్నారు?" రాఘవ అడిగాడు.

"ఇక్కణ్ణుంచే పనిమీద కలకత్తా వచ్చాం. ఆయన... అదే మీ మావయ్య కూడా వచ్చారు నాతో. హోటల్ తాజ్ బెంగాల్‌లో వున్నాం. నిన్ను ఒక్కసారి చూడాలని వుంది. వస్తావా?"

"ష్యూర్. తప్పకుండా వస్తాను." వివరాలు కనుక్కుని ఫోన్ వుంచి లేచాడు.

రాఘవ పచ్చటి తెలుపు. ఆరడుగుల మనిషి. నల్లటి వంకీల జుట్టు. నున్నటి క్రాఫింగ్. స్నానం చేసి నీలం రంగు పాంటుమీద పాడుం రంగు టీ షర్టు వేసి టక్ చేసాడు. జుట్టుని కొంచెం ముందుకు దువ్వి క్రాఫ్ సరి చేసాడు. బయటకు నడిచి మోటారు బైక్ తీసాడు. బైక్ హోటల్ వైపుకి దారి తీసింది.

మేనల్లుడ్ని చూసేసరికి వసుమతికి ముందు నోటమాట రాలేదు. ఆమెకి తన తండ్రి గుర్తొచ్చారు. రాఘవది అచ్చం అదే పోలిక! ఆప్యాయంగా పలకరించింది వసుమతి.

"అత్తా! ఎన్నాళ్లయింది మిమ్మల్ని చూసి! ఎప్పుడో నా చిన్నప్పుడు చూశాను."

ఆమెని చూడగానే అభిమానం పొంగుకొచ్చింది రాఘవకి.

వసుమతి తన భర్తని పరిచయం చేసింది.

మనుషులంతా ఒకటే అంటారు. కాని ఒకటికాదు.

"నీలో ప్రవహిస్తున్నదీ... నాలో ప్రవహిస్తున్నదీ రక్తమే అంటారు.

కాని రక్తం కూడా ఒకటికాదు. వేరు వేరు. ఎ పాజిటివ్, నెగిటివ్. బి. పాజిటివ్, నెగిటివ్, ఓ పాజిటివ్ యిలా ఎన్నో రకాలు! ప్రాంతం వేరు, భాష వేరు, కులం వేరు, మతం వేరు, దేశం వేరు- అయినప్పుడు ముఖాలు కూడా వేరు వేరుగానే వుంటాయి. ఆంధ్రలో పుట్టిన వాళ్లని, అస్సాంలో పుట్టినవాళ్లని సులభంగా పోల్చేవచ్చు. మనిషి ముఖం చూసి, వేష-భాషలు చూసి ఏ ప్రాంతం వాడో కొంతవరకు చెప్పొచ్చు.

వసుమతి భర్త కేరళ క్రిస్టియన్. మాటతీరూ అదీ కొంచెం భిన్నంగా వుంది. కాని మనిషి చాలా మంచివాడని అతనితో కొంతసేపు మాట్లాడిన తర్వాత తెలిసింది. వసుమతి అంది.

"మా పెళ్లి... యింట్లో ఎవ్వరికీ యిష్టం లేదు. నాన్నగారు నా ముఖం చూపించ వద్దని, మరెప్పుడూ యింటికి వచ్చే ప్రయత్నం చెయ్యొద్దని అనేసారు. ప్రేమించి పెళ్లి చేసుకోవడం తప్పా, చెప్పు రాఘవా?! ఆయన స్వయంకృషిని నమ్ముకున్న వ్యక్తి. ఎదుటివారి వ్యక్తిత్వానికి గౌరవం యిచ్చే మంచి మనసుగల మనిషి"

ఆయనపేరు, వ్యక్తిగత జీవితం, అత్తతో అతని ప్రేమ-పెళ్లి... యివన్నీ అడిగి తెలుసుకోవాలని వుంది రాఘవకి. రాఘవ మనసులోని మాట కనిపెట్టినట్లుగా రాఘవ అడక్కుండానే చెప్పడం మొదలుపెట్టింది.

"కష్టేఫలే అని వినేవుంటావు. కష్టాన్ని నమ్ముకున్న వ్యక్తికి ఎప్పుడూ నష్టం కలగదు. ఈనాడు యింత పెద్ద హోదాలో వున్నారంటే దీని వెనక అతని కృషి ఎంత దాగి వుందో ఎవరైనా వూహించగలరు."

వసుమతి తన భర్త గురించి మొదట్నుంచి చెప్పడం మొదలెట్టింది...

★ ★ ★

ఇట్టీ కోషీ (Itty Koshi) క్రిష్టియన్. వాళ్లనాన్న స్కూలు టీచరు.

అది 1972 సంవత్సరం. అప్పుడు అతనికి పదిహేడేళ్లు. టెన్త్ పాసయ్యాడు. "నాదగ్గర డబ్బులేదు. నేను నిన్ను చదివించలేను." అని వాళ్ల నాన్నగారు చెప్పేసారు.

వాళ్ల నాన్న ఫ్రెండ్ ఒకతను భూటాన్‌లో వున్నాడు. "భూటాన్ వస్తే నీకు వుద్యోగం యిస్తాను." అని చెప్పాడు అతను. కాని ఇట్టీ కోషీని భూటాన్ పంపడం వాళ్ళ నాన్నకిష్టంలేదు. భూటాన్ అతని అడ్రసు పట్టుకుని అతనికి ఒక ఉత్తరం వ్రాసాడు. ఒకరోజు వాళ్ల నాన్న జేబులోంచి నూరు రూపయలు దొంగతనం చేసి కొచ్చిన్ నుండి అలిపుర్ ద్వార్ దాకా టికట్టు కొన్నాడు. దాదాపు నాలుగయిదు రోజులు జనరల్ కంపార్టుమెంటులో ప్రయాణం!

కొంతమంది మిలటరీ వాళ్లు ఆ కంపార్టుమెంటులో వున్నారు. టికట్టు కొనగా మిగిలిన ఎనిమిది రూపాయలు అతని దగ్గర వున్నాయి. అవి ఖర్చయిపోగా యింకా మిగిలిన చిల్లర డబ్బులతో వేరుశనగ కాయలు కొనుక్కుని తిన్నాడు. అయినా ఆకలికి తట్టుకోలేక అలిపుర్ ద్వార్ దాకా వెళ్లేసర్కి ముఖం తిరిగి పడిపోయాడు. అదే చివరి స్టేషన్ అవడంతో మిలటరీ వాళ్లు అతని జేబులో వున్న అడ్రసు చూసి భూటాన్‌లో వున్న ఆ ఫ్రెండ్‌ని పిలిపించారు. అతనొచ్చి తీసుకు వెళ్లి ఒక రోజు మాత్రమే భోజనం పెట్టి తర్వాత కార్పెంటరీ షాపులో కర్రలకి పాలిష్ చేసే పని యిప్పించాడు.

ఇట్టీ కోషీ ఎలాగో నెలరోజులు ఆ పని చేసాడు. కాని ఆ పని అతనికి నచ్చలేదు. "ఈ మాత్రం వుద్యోగం కేరళలోనైనా దొరుకుతుంది. అనవసరంగా యిక్కడకు వచ్చాను." అని బాధ పడ్డాడు.

అప్పట్లో (Tala Hydro Electric Project) తాలా హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణంలో వుంది. కొండ తవ్వడానికి, రాళ్లు కొట్టడానికి అందులో చేరాడు ఇట్టీ కోషీ.

అక్కడే (labour colony) లేబర్ కాలనీలో వుండేవాడు.

ఘాట్ రోడ్లు తయారు చెయ్యడానికి లేబర్ అవసరం వుంది. డైలీ వేజస్ క్రింద మూడునెలలు చేసాడు ఇట్టీ కోషీ. పని చేస్తూ మధ్య మధ్య పుస్తకాలు చదివేవాడు.

ఒకరోజు అలాగే పని మధ్యలో పుస్తకం చదవడం, భూటాన్‌లోని ప్రముఖ వ్యాపారవేత్త పాసంగ్ దోర్జీ అనే ఆయన చూసాడు.

అది 1974. అప్పుడు భూటాన్‌లో పదవ తరగతి పాసయినవాళ్లకి సులువుగా ఉద్యోగాలు వచ్చేవి. పాసంగ్ దోర్జీ, ఇట్టీ కోషీని చూసి సరదాపడి "కర్మా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్"లో క్లర్క్ వుద్యోగం యిప్పించాడు.

ఇట్టీ కోషీ వుద్యోగం చేస్తూ చదువుకుని బి.ఎ., పాసయ్యాడు. క్లర్క్ తర్వాత అకౌంటెంట్ అయ్యాడు. తర్వాత మేనేజరు అయ్యాడు. తర్వాత సీనియర్ మేనేజరు అయ్యాడు.

ప్రస్తుతం అతను జనరల్ మేనేజరు!

మేనేజరుగా ప్రమోషన్ వచ్చినప్పుడు ఇట్టీ కోషీ కేరళ వచ్చాడు. అప్పుడు నన్ను చూసాడు. అతని మంచితనం మీద నాకు బాగా నమ్మకం కుదిరింది. మా యిద్దరి మనసులు కలిసాయి! అతను నన్ను పెళ్లి చేసుకుంటానన్నాడు. నేను యింట్లో వాళ్లకి చెప్పాను. నాన్నగారు అగ్గిమీద గుగ్గిలం పోసినట్టుగా మండిపడ్డారు. కులం-గోత్రం లేనివాడన్నారు. మతాలు వేరయినప్పుడు పెళ్లి చేసుకుంటే ధర్మానికి అమంగళం వాటిల్లుతుందని అన్నారు. ఇట్టి కోషీ మా యింటికొచ్చి నాన్నగారిని బ్రతిమాలాడు. అయినా నాన్నగారు మమ్మల్ని, మా ప్రేమని అర్థం చేసుకోకుండా మెడపట్టి గెంటేసారు.

ఆ తర్వాత నేను యింట్లోంచి వెళ్లిపోయి అతన్ని పెళ్లి చేసుకున్నాను. మా పెళ్లి చర్చిలో జరిగింది. కులం-మతం అన్నీ మానవత్వం ముందు ఓడిపోయాయి!

అంత ఉత్తముడైన భర్త లభించినందుకు నాలో నేను పొంగిపోయాను! మేం భూటాన్ వచ్చేసాం. మాకు కొడుకు పుట్టాడు. అప్పుడు భూటాన్‌లో కొత్తగా ఒక చట్టం వచ్చింది.. 1957 సంవత్సరం కన్నా ముందునుంచీ ఆ దేశంలో వుండి, స్వంత యిల్లుగాని, స్థలంగాని వుండి అప్పట్నుంచి ఎవరు భూమిశిస్తు కడ్తున్నారో వాళ్లే భూటానీ పౌరులు అని, మిగతా వాళ్లందర్నీ ఆ దేశం వదిలి వెళ్లిపొమ్మని భూటాన్ రాజు ఆర్డర్ వేసాడు. ఉద్యోగరీత్యా వున్నవాళ్లని కూడా విదేశీయులుగా చేసారు. ఆ దేశంలో ఎంతవరకు వుండాలో అంతవరకే పర్మిట్ యిస్తారు. ఆ తర్వాత ఆ దేశం వదిలి వెళ్లిపోవాలి!

అప్పటికి మాకు యిద్దరు పిల్లలు. పిల్లల చదువులు పాడవుతాయని యిద్దర్నీ కేరళలో హాస్టల్‌లో వుంచి చదివించాం. కొడుకు శామ్యూల్ ఇంజినీరు. కూతురు మోనికా ఎమ్.సి.ఎ. చేసింది. ఈ మధ్యనే దానికి కలకత్తాలో జాబ్ వచ్చింది. అది ఇక్కడే జాబ్ చేస్తున్నాది.

నేను ప్రేమించి పెళ్లి చేసుకున్నాను. ఇప్పుడు నాకేమయింది?! హాయిగా వున్నాను. ఆనాడు నాన్నగారు అన్న మాటలు యిప్పటికీ నేను మర్చిపోలేదు. "వాడు నిన్ను నమ్మించి మోసం చేస్తాడే! వాడు దుర్మార్గుడు. వాడిని నమ్మి జీవితంలో అడుగు ముందుకు వేయడం అంటే కుక్క తోకని పట్టుకుని గోదావరి ఈదినట్టే!" అన్నారు.

"దుర్మార్గం మతంలో లేదు. మనస్తత్వంలో వుంది" అన్నాను నేను, నాన్నగారికి నచ్చజెప్తున్న ధోరణిలో... అలా చెప్తూంటే వసుమతికి కళ్లంట నీళ్లు వచ్చాయి. ఆపుకునే ప్రయత్నం చెయ్యలేదు ఆమె.

"ఇంకా యిలా అన్నారు నాన్నగారు: "నిప్పుతో చేతులు కడుక్కునే వంశం మనది! మన సనాతన బ్రాహ్మణ వంశానికి మచ్చ తెచ్చే పని చెయ్యకు. మన సత్సంప్రదాయాన్ని మంటగలిపే పని చెయ్యకు. నువ్వు ధర్మానికి ఎదురు వెళ్తున్నావు, "ధర్మోరక్షతి రక్షితః" ధర్మాన్ని మనం రక్షిస్తే ధర్మం మనల్ని రక్షిస్తుంది! ఇంత విపరీత ఆలోచన నీ మనసులోకి ఎలా వచ్చింది? నీతి-నిజాయితీలనే ఊపిరిగా భావించే నేను, మన వంశ పరువు-ప్రతిష్ఠలకి ప్రాధాన్యతనిచ్చే నేను నలుగురిలో తలెత్తుకు ఎలా తిరగ్గలను?!" అని చీవాట్లు పెట్టారు! జరిగింది చెప్పుకుంటూ వసుమతి యింకా కన్నీరు పెట్టుకుంది.

కాని రాఘవ మనసుని ఆమె కన్నీరు ఏమాత్రం కదిలించలేకపోయింది. ఎందుకంటే రాఘవవి అన్నీ తాతగారి అలవాట్లూ-అభిప్రాయాలూ. తాతగారి అడుగు జాడల్లో నడిచే అసలైన మనవడు రాఘవ!...

వసుమతి కళ్లు తుడుచుకుని రాఘవవైపు చూసింది.

"మా మోనికాను నువ్వు చూడలేదు కదూ. ఈ వూర్లోనే వర్కింగు వుమెన్స్ హాస్టల్లో వుంటున్నాది. ఇప్పుడు వచ్చేస్తుంది. చూద్దువు గాని... మా మోనికా వుందే... గొప్పలు చెప్పుకోకూడదు గాని చాలా బుద్ధిమంతురాలు. చక్కగా వుంటుంది. అన్నీ మన బ్రాహ్మణ పద్ధతులే వచ్చాయి. దద్ధోజనం, పులిహోర, బూరెలు, బొబ్బట్లు యివన్నీ చెయ్యడం దానికి బాగా వచ్చు. అవన్నీ దానికి నేనే నేర్పాను. జీసస్‌ని, జగన్నాధుడ్ని పక్కపక్కనే వుంచి పూజచేస్తాం మా యింట్లో. కృష్ణుడికీ-క్రీస్తుకీ తేడాలేదు మాకు. కృష్ణాష్టమి-క్రిస్మస్ పండుగలని ఒకేలా చేసుకుంటాం! మోనికాకి మన పండుగలన్నా, మన సంప్రదాయాలన్నా చాలా యిష్టం! అంతా మీ నాయనమ్మ పోలికే దానికి వచ్చింది!..." మోనికా గురించి అదేపనిగా చెప్తున్నాది వసుమతి.

ఇట్టీ కోషీకి తెలుగురాదు. వసుమతి రాఘవతో మాట్లాడుతున్న మాటల్లో పేర్లు తప్ప మరే ఒక్కటీ అర్థం కావడంలేదు అతనికి.

ఇంతలో మోనికా వచ్చింది.

వసుమతి ముఖం కూతుర్ని చూసేసరికి సంతోషంతో వెలిగి పోయింది. వసుమతి తన కూతుర్ని రాఘవకి పరిచయం చేసింది. "చూపులకి బాగానే వుంది" అనుకున్నాడు రాఘవ.

"అలా సిగ్గుపడకే. మీ బావ. నీకు వరసవుతాడు!" అంది వసుమతి మురిపెంగా.

మోనికా ఆశ్చర్యపోయింది. తను సిగ్గుపడకుండానే అమ్మ "అలా సిగ్గుపడకు!" అని ఎందుకందో అర్థం కాలేదు.

"హాయ్!" అంది, రాఘవకి చెయ్యి ఆడించి.

రాఘవ కొంత మేరకు మాటలు కలిపాడు ఆ అమ్మాయితో.

కొంతసేపటికి వసుమతి కూతుర్ని లోపలికి పిల్చి ఏదో చెప్పింది. తర్వాత బయటకు వచ్చి,

"ఇద్దరూ అలా సరదాగా ఎక్కడికయినా వెళ్లిరండి". అంది వసుమతి వాళ్లిద్దర్నీ మురిపెంగా చూసుకుంటూ.

ఆమె ఆంతర్యం కొంచెం కొంచెం అర్థమవుతున్నాది రాఘవకి.

"పద బావా! వెళదాం." అంది మోనికా.

కూర్చున్న చోటునుంచి లేస్తూ ఒకసారి మేనత్త వైపు చూసాడు రాఘవ.

ఆమె ముఖంలోకి వింత కాంతి వచ్చింది.

ఇద్దరూ 'నిక్కోపార్కు'కి వచ్చారు.

రాఘవకి ఏం మాట్లాడాలో తెలియడం లేదు.

చాలా సేపు మౌనం తర్వాత మోనికా మొదట గొంతు విప్పింది.

"మమ్మీ నా గురించి ఏం చెప్పింది బావా?"

రాఘవ అదోలా నవ్వాడు!

"నువ్వు... చాలా మంచి అమ్మాయివని, నీకు మన వంటలూ అవీ బాగా వచ్చని... నిన్ను అదేపనిగా పొగిడేస్తోంది మీ అమ్మ."

మోనికా రాఘవ కళ్లల్లోకి చూసింది. కాని అతని కళ్లు చూసి మనసు చదవడం కష్టమనిపించింది మోనికాకి.

"బావా! ఈపాటికి అమ్మ మనసులో ఏముందో నీకు అర్థమయే వుంటుంది".

"ఏమిటి?" ఏమూలో చిన్న అనుమానం వున్నా ఏమీ తెలియనట్టు అడిగాడు సందేహంగా ముఖంపెట్టి.

"అయితే నీకు తెలీదన్నమాట. చెప్పేస్తున్నాను విను. మనిద్దరికీ పెళ్ళి చెయ్యాలని అమ్మకి మనసులో చాలా కోరికగా వుంది..."

సరిగ్గా అదే ఊహించాడు రాఘవ. కాని ఆ విషయం అతని మనసుకి ఏమాత్రం సంతోషం కలిగించలేదు. అలా అని ఆ ఆలోచనని చంపనూలేకపోయాడు. మోనికా చూపులకి బాగానే వుంది. పైగా మేనత్త కూతురే. కాని మనసు లోపలి పొరల్లో మేనత్త చేసిన పని హర్షించ తగ్గది కాదు అనే భావం స్థిరపడి ఉంది. ఈ మోనికా ఆ మేనత్తకీ ఇట్టి కోషీకీ కూతురు కదా అనుకోగానే పరమ నిష్ఠా గరిష్ఠుడైన తాతగారు జ్ఞాపకం వస్తున్నారు.

అత్త అంటే అభిమానం వుంది.

ప్రథమ పరిచయంలోనే ప్రేమ పుడుతుందని కొంతమంది అంటారు. కాని మోనికాపై తనకి అలాంటిదేమీ కలగలేదు.

మోనికా మాటలు విన్న రాఘవకి మాట తోచలేదు. కొన్ని నిముషాలు దిక్కులు చూస్తూ వుండిపోయాడు...

మోనికాని తను ప్రేమించలేదు. ఆ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకునేటంత గొప్ప మనసు కాని... మేనత్త తృప్తి కోసం, పెద్దవాళ్లని ఎదిరించి చేసుకునేంత ఆదర్శం కాని తనకి లేవు!

ఇటుచూస్తే మోనికా కూడా తన మనసు అర్థం చేసుకోవడానికీ తనని ఆకర్షించడానికీ ప్రయత్నం చేస్తున్నట్టు కనబడుతోంది.

"బావా! ఏంటాలోచిస్తున్నావు?"

'బావా! బావా!' అని మోనికా పదే పదే చనువుగా పిలవడం కూడా రాఘవకి ఎందుకనో నచ్చడం లేదు.

అతని కళ్లముందు తాతగారు మెదులుతున్నారు. వంశం పరువు-ప్రతిష్ఠలు మెదులుతున్నాయి! నిష్ఠనే ప్రాణంగా చూసుకొనే వంశంలో పుట్టిన తను, తాతగారి యిష్టానికి వ్యతిరేకంగా, వంశానికి చెడ్డపేరు తెచ్చేపని చెయ్యలేడు.

'పెద్దవాళ్ల యిష్టానికి వ్యతిరేకంగా, వాళ్లని క్షోభపెట్టి ఎవరినో ప్రేమించి పెళ్లి చేసుకోవడంలో లేని సుఖం కంటే, సత్సంప్రదాయాన్ని అనుసరించి, పెద్దల అభిప్రాయానికి విలువిచ్చి, పెద్దలు కుదిర్చిన అమ్మాయిని వేదమంత్రాల మధ్య, అగ్నిసాక్షిగా తాళి కట్టి పవిత్ర బంధాన్ని ఏర్పరుచుకుని, ఆ అమ్మాయిని ప్రేమించడంలో వుండే సుఖమే మిన్న!' అని రాఘవ అభిప్రాయం. సంప్రదాయానికి, భారతీయ వివాహ వ్యవస్థకి ఎక్కువ విలువనిచ్చే మనిషి రాఘవ!

రాఘవ ఏమీ మాట్లాడకపోవడం చూసి మోనికా మళ్లీ తనే మాట్లాడింది.

"బావా! నేను చాలా నిర్మొహమాటంగా మాట్లాడతాను. నిన్ను చూడకుండానే నీ గురించి అమ్మ చెప్పింది విని నీమీద యిష్టాన్ని పెంచుకున్నాను. నిన్ను చూసాక ఆ యిష్టం మరింత పెరిగింది! నువ్వేమో ఏమీ మాట్లాడం లేదు. ఒ.కే. బావా! ఇందులో ఎటువంటి బలవంతం లేదు. బాగా ఆలోచించుకో. రేపు ఉదయం నేను కూడా ఈ హోటల్లోనే వుంటాను. నువ్వు ఏ సంగతీ నాకు ఫోన్ చేసి చెప్పు. నీ ఫోన్ కోసం ఎదురు చూస్తూ వుంటాను! నీ దగ్గర్నుంచి ఫోన్ రాలేదంటే... నీకిష్టం లేదని అనుకుంటాను. ఆ విషయం అమ్మకి చెప్పేస్తాను. కొంతకాలంగా విడిపోయిన మన రెండు కుటుంబాలనీ కలుపుదామని మా అమ్మకి ఉన్న కోరిక కంటె, మనం ఇద్దరం ఒకే రకం ఆలోచనలతో సహజీవనం చెయ్యగలమా అని చూసుకోవడం ముఖ్యం. అందుచేత అమ్మ మాటల్నీ కోరికనీ మనసులో పెట్టుకొని ఫీలయిపోకు. పద, వెళదాం." అంటూ లేచింది మోనికా.

మర్నాడు రాఘవ మోనికాకి ఫోన్ చెయ్యలేదు...

★ ★ ★

(అముద్రితం)